క్లుప్తంగా

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. 176 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ముత్తూట్ ఫిన్ కార్, హెచ్‌డీఎఫ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, తదితర కంపెనీల్లో 40 మందికి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ రంగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, టాస్క్ కోఆర్డినేటర్ హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యత పెంచుతుంది

మంచిర్యాలక్రైం: ప్రతి ఉద్యోగికి పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. కమిషనరేట్‌లో సీపీ గురువారం వారికి పదోన్నతి చిహ్నాలు, ర్యాంకులు అందజేశారు. అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐ వామనమూర్తి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ పరామర్శ



మధునయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ సాక్షి విలేకరి అట్టెం మధునయ్యను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ గురువారం పరామర్శించారు. రెండ్రోజుల క్రితం మధునయ్య తల్లి మృతిచెందగా.. ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఔదార్యం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జన్నారం: స్నేహితుడి కూతురు వివాహానికి పూర్వ విద్యార్థులు రూ.34 వేలు నగదు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. జన్నారం గ్రామానికి చెందిన ఫక్రొద్దీన్ కూతురు వివాహం శుక్రవారం జరగనుంది. నిరుపేద అయిన ఫక్రొద్దీన్ పరిస్థితిని గమనించి జన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1986–87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తలకొంత పోగు చేసిన నగదు గురువారం అందజేశారు. పూర్వవిద్యార్థులు గాజుల లింగన్నగౌడ్, అల్లం నరేశ్, కొండాపురం శ్రీనివాస్, రహిముల్లా, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

మంచిర్యాలటౌన్: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి పట్టభద్రుల మద్దతు కోరాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ముల పోశం, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు విజయ్ కుమార్, కార్మిక నాయకులు దాసరి శ్రీనివాసరావు, ధన్‌సింగ్, బంగారి వేణు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు జెడ్పీ సెకండరీ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు 'అమ్మా నీకు వందనం అనే 50 రోజుల ప్రత్యేక ప్రణాళిక'ను రూపొందించినట్లు హెచ్‌ఎం ఎం.దత్తకుమార్ తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదువుకుంటామని ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా ఫోన్ ఇన్ ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం, ప్రతి వారానికి స్లిప్‌టెస్టులు రాయడం వంటివి ఉంటాయని పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలి

మందమర్రిరూరల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్)లో పనిచేస్తున్న తమకు రావల్సిన మూడు నెలలు వేతనాలు చెల్లించాలని సిబ్బంది కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని తెలిపారు. ఈజీఎస్ ఏపీవో రజియాసుల్తానా, సీవోఅండ్ఏపి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు అనితతోపాటు సాగర్, శ్రీలత, టీఏ కుమార్, తిరుమల్‌గౌడ్, రాయమల్లు, తదితరులు ఉన్నారు.

నెరవేరిన కల

- తాండూర్, నెన్నెల, వేమనపల్లికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- ఉత్తర్వులు జారీ
- తొలగనున్న గ్రామీణ విద్యార్థుల ఇక్కట్లు



తాండూర్: సీఎం, బెల్లంపల్లి ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: ఏళ్లుగా నిరీక్షిస్తున్న కల నెరవేరింది. పల్లె ప్రాంతాల విద్యార్థుల సౌలభ్యం కోసం కొత్తగా మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. తాండూర్, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో వీటిని ఏర్పాటు చేయడానికి తాజాగా రాష్ట్ర ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న గ్రామీణ విద్యార్థుల కల సాకారమైంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మండలాల పదో విద్యార్థులు ఇక అందుబాటులోనే కళాశాలలో చేరడానికి మార్గం సుగమమైంది. ఇన్నాళ్లుగా పడుతున్న కష్టాలు దూరం కానున్నాయి. కోఎడ్యుకేషన్‌గా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రారంభించనున్నారు.

కళాశాల మంజూరుపై హర్షం..

బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం బెల్లంపల్లి, కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా నూతనంగా తాండూర్, నెన్నెల, వేమనపల్లికి కళాశాలలు మంజూరయ్యాయి. భీమిని, కన్నెపల్లి మండలాల్లో మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక బెల్లంపల్లికి వచ్చి ఇంటర్మీడియెట్‌లో చేరాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాజాగా కళాశాలల మంజూరు పట్ల మండలాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యే పట్టుదలతో..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఏడాది పదవీ కాలంలో హామీని నిలబెట్టుకున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కళాశాలలు మంజూరవుతాయని పల్లె విద్యార్థులు ఆశించారు. పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న దుర్గం చిన్నయ్య తనవంతుగా యత్నాలు చేసినప్పటికీ ఏ కారణంగానో మంజూరు చేయించలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే వినోద్ పట్టుదలతో ప్రయత్నాలు చేసి సఫలీకృతం అయ్యారు. ఇందుకు మండలాల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి దశాబ్దాల కోరికను నెరవేర్చుకోవడం గమనార్హం. కాగా భీమిని, కన్నెపల్లి మండలాల్లోనూ జూనియర్ కళాశాలలు మంజూరు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు కోరుతున్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



నెన్నెలలో..



వేమనపల్లిలో..

తాండూర్/నెన్నెల/వేమనపల్లి: తాండూర్, నెన్నెల, వేమనపల్లి మండలాలకు కళాశాలలు మంజూరు కావడంపట్ల కాంగ్రెస్ నేతలు సంబురాలు జరుపుకొన్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. గురువారం తాండూర్ ఐబీ వద్ద, వేమనపల్లి, నెన్నెలలో సీఎం రేవంత్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎంతోపాటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్‌రావు, మాజీ ఎంపీపీ శంకర్, వేమనపల్లిలో మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, యూత్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నెన్నెలలో మల్లేశ్, హరీష్‌గౌడ్, శ్రీనివాస్, మల్లాగౌడ్, రాజేశ్, గట్టు బానేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాను



ఎన్నికల ప్రచారంలో జూనియర్ కళాశాలలు లేని విషయాన్ని మండలాల ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారు. తనను గెలిపిస్తే మంజూరు చేయిస్తానని హామీఇచ్చాను. ఆ ప్రకారం తాండూర్, నెన్నెల, వేమనపల్లి మండలాలకు కళాశాలలు మంజూరు చేయించాను. ఇప్పుడు నాకెంతో తృప్తిగా ఉంది. మిగతా రెండు మండలాల్లోనూ ప్రాధాన్యత క్రమంగా మంజూరు చేయిస్తా. ప్రజల మద్దతు తనపై ఉండాలి. – గడ్డం వినోద్, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే, శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాష్ట్ర మంత్రులను కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను వేర్వేరుగా కలిశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన లింగుస్వామి జాతర



హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



పూజలు చేస్తున్న జీసీసీ చైర్మన్ తిరుపతి

కాసిపేట: మండలంలోని కుర్రెఘడ్‌లో పాహండి కూపర్ లింగుస్వామి జాతర బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్(జీసీసీ) చైర్మన్ కోట్నాక తిరుపతిలు లింగుస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లింగుస్వామి ఆలయ అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారం అందిస్తామన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పూజలు, హోమం, అగ్నిగుండాలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకుడు, పూజారి కుర్సింగ భూదేవ్‌స్వామిని జీసీసీ చైర్మన్ సన్మానించారు. శుక్రవారం వరకు జరిగే జాతరకు దేవాపూర్ ఎస్సై అంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆదివాసీ సంఘాల నాయకులు పెంద్రం శ్రీనివాస్, సోయం జంగు, మడావి వెంకటేశ్, పెంద్రం శంకర్, సిడాం గణపతి, పెంద్రం ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకుడు మైదం రమేశ్ ఉన్నారు.

మందమర్రి మున్సిపల్ కమిషనర్ బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వనపర్తి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామగుండం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తుంగపిండి రాయలింగు నియామకం అయ్యారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న కమిషనర్‌ను సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.

మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ బదిలీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ లక్సెట్టిపేట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్‌వో)గా పనిచేస్తున్న శివాజీని మంచిర్యాలకు బదిలీ చేసినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

భీమారం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను గురువారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారికి ఇరువైపులా న్యూఇయర్, సంక్రాంతికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



బెల్లంపల్లి: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం, స్వాతంత్య్రం కోసం గాంధీ చేసిన సేవలను కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, టీపీసీసీ సభ్యుడు శంకర్, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేంద్రనాథ్ గురువారం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ నవీన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట: మండలంలోని బుగ్గగూడ శివారు అటవీ ప్రాంతంలో గురువారం పులి పాదముద్రలు కనిపించాయని, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. కర్షలఘట్టం, వరిపేట, పల్లంగూడ తదితర గ్రామాల ప్రజలు, కాపర్లు, రైతులు అడవిలోకి వెళ్లొద్దని సూచించారు. రాత్రిసమయంలో చేలలోకి వెళ్లద్దని పేర్కొన్నారు.

పులి సంచారం..

సోనాపూర్, లక్ష్మీపూర్, కర్షలఘట్టం ప్రాంతంలో రెండు రోజులుగా పులి గాండ్రింపులు వినిపించాయని గ్రామాల ప్రజలు తెలిపారు. అటవీ అధికారులకు ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో నిర్ధారణకు రాలేదు. అడవికి అనుకొని ఇటు తిర్యాణి, అటువైపు లక్సెటిపేట అటవీప్రాంతంలో పులి ఇటు వైపు నుంచి వచ్చిందనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. తిర్యాణి అటవీప్రాంతంలోని రెండు రోజులుగా పులి ఆనవాళ్లు కనిపించక పోవడంతో ఈ ప్రాంతంలో సంచరిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గుర్తింపు యూనియన్‌లో నిర్మాణాత్మక సమావేశం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ప్రతినిధులతో నిర్మాణాత్మక సమావేశం జరిగింది. జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం ప్రతినిధులు పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కాసిపేట–2 గనిలో ఫ్యాన్ ఆపరేటర్‌కు షెడ్డు ఏర్పాటు, గనిలో స్కావెంజర్‌ను నియమించాలని, కేకే ఓసీలో ఫర్నిచర్, లాకర్ ఏర్పాటు, సోమగూడెం భరత్ కాలనీలో సౌకర్యాలు కల్పించాలని, రామకృష్ణాపూర్‌లోని కమ్యూనిటీ హాల్లో కుకింగ్, డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జీఎం..పరిష్కారానికి కృషి చేస్తానని, బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సహకరించాలన్నారు. సమావేశంలో ఆయా విభాగాల అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, రామకృష్ణాపూర్ కార్యదర్శి అక్బర్‌అలీ, నాయకులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వేమనపల్లి: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, వివక్ష చట్టరీత్యా నేరమని మహిళా సాధికారిత సబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, విజయ అన్నారు. శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ఆశ్రమ పాఠశాల వద్ద విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పడావో పథకం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సఖీ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసులు 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14567 వివరించారు. పోక్సో చట్టం, బాలికల చైల్డ్ ఎడ్యుకేషన్, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైం, సుకన్య సమృద్ధి యోజనపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జంతు సంరక్షణ దినోత్సవం

మందమర్రిరూరల్: ఊరు మందమర్రిలోని పశువైద్యశాలలో జంతు సంరక్షణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూగజీవాలపై ప్రేమ కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురు తీసుకువచ్చిన వారి పెంపుడు కుక్కలకు పశు వైద్యాధికారి తిరుపతి రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అదేవిధంగా పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- గాంధీ విగ్రహాలకు వినతులు



బెల్లంపల్లి: గాంధీ విగ్రహం ఎదుట నాయకుల నిరసన



జన్నారంలో..

మంచిర్యాలటౌన్: ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదైనా నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపులో భాగంగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో గురువారం గాంధీ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ 420 రోజులు గడిచినా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను తామే ఇచ్చినట్లు కాంగ్రెస్ చెబుతుందన్నారు. వంద రోజుల్లో రూ.2 లక్షల రుణమాఫీ చెప్పి బీఆర్‌ఎస్ పోరాటంతో కొందరికే ఇచ్చిందన్నారు. హామీలు అమలు చేసేలా కాంగ్రెస్‌కు బుద్ధి ఇవ్వాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, హాజీ కౌన్సిలర్లు అంకం నరేశ్, చంద్రశేఖర్ హండే, ఎడ్ల శంకర్, నాయకులు తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, వొడ్నాల రవీందర్, సాగి వెంకటేశ్వరరావు, సుధీర్, గట్టయ్య, సంతోష్, శంకర్, రమేశ్, శ్రీనివాస్, హాజీపూర్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, నంనూరు మాజీ సర్పంచ్ బేర పోచయ్య పాల్గొన్నారు.

బెల్లంపల్లి: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ఆరోపించారు. బెల్లంపల్లి పాత జీఎం కార్యాలయం క్రాస్ రోడ్డు వద్ద మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందించారు. 420 రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ హామీలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రశ్నించే ప్రతి పక్షాల గొంతులను నొక్కేస్తోందన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాలతో చెన్నూర్‌లోని గాంధీ చౌక్‌లో గాంధీజీ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు రాజా రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో గాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు గంగాధర్, పజల్‌ఖాన్, విజయధర్మా, రవి, ప్రభుదాస్, నర్సింహులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక గాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాసు కాంతయ్య, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, చాంద్‌పాషా, తిరుపతి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగిలి రవీందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంగడి బజార్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. అబ్బాస్, తిరుపతిరెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్, కనుకయ్య, శంకర్, రాజ్‌కుమార్, సురేందర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

పోస్టర్ల ఆవిష్కరణ

లక్సెట్టిపేట: వరంగల్‌లో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వచ్చేనెల 2న నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సమావేశం పోస్టర్లను స్థానిక ఐబీ ఆవరణలో ఆవిష్కరించారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. నాయకులు రవి, పాడేటి శ్రీనివాస్‌గౌడ్, పాదం శ్రీనివాస్, శంకర్‌రావు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

దండేపల్లి: సైబర్ నేరాలు, మత్తుపదార్థాలు, రోడ్డు భద్రత నియమాలపై దండేపల్లి బస్టాండ్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై రాజేందర్, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నెన్నెల: గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టర్, డీసీపీ చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న నెన్నెల ఎస్సై ప్రసాద్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. నాయకులు గట్టు మల్లేశ్, మల్లాగౌడ్, సింగతి తిరుపతి, మంచర్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యస్థాపనే లక్ష్యం

పాతమంచిర్యాల: రాష్ట్రంలో బహుజన రాజ్యస్థాపనే లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీ పని చేస్తోందని రాష్ట్ర నాయకులు హరప్పా, అన్నెల లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ధర్మసమాజ్ పార్టీ అణగారిన వర్గాల కోసం ఏర్పడిందన్నారు. రాబోయే ఎన్నికల్లో పేదల పక్షాన పార్టీ పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

జైపూర్: మండలంలోని పెగడపల్లి, బెజ్జాల, కుందారం, శెట్‌పల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీవో పీడీ కిషన్ గురువారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో బాలయ్య, ఈసీ రాజమౌళి, తదితరులు ఉన్నారు.

నూతన ఎంపీటీసీ స్థానంగా కేస్లాపూర్

భీమిని: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం ఎంపీడీవో గంగామోహన్ కొత్త ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి నోటీసు బోర్డును అంటించారు. మండలంలో గతంలో భీమిని, వీగాం, పెద్దపేట, చిన్నగుడిపేట గ్రామాలు ఉండగా జనాభా లెక్కల ప్రకారం నూతనంగా కేస్లాపూర్ ఎంపీటీసీ స్థానాన్ని ఎంపిక చేశారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వచ్చేనెల 1,2 తేదీల్లో తెలపవచ్చునని వివరించారు. తుది జాబితా 3న తర్వాత తయారు చేస్తామన్నారు. ఏపీవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కోటపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లి శివారులో బంజరుకుంటను రాత్రికి రాత్రే సిమెంట్‌పోల్స్, ఫెన్సింగ్ వేసి అక్రమించిన వేముగంటి మదన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజయ్య, చంద్రయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

భీమారం: ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బీఐ రీజనల్ మేనేజర్ రితేశ్‌గుప్తా సూచించారు. ఆపత్కాలంలో కుటుంబానికి అండగా ఉండే పీఎంజేజేబీవై, పీఎం ఎస్బీఐలో బీమా తీసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన దుర్గం తిరుపతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా నామినీగా ఉన్న భర్త తిరుపతికి రూ.20 లక్షలు, మరికొందరికి భీమారం ఎస్బీఐ బ్రాంచిలో గురువారం చెక్కులు పంపిణీ చేశారు. మేనేజర్ జి.సుబ్బారెడ్డి, సిబ్బంది రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.